## కొత్త రచయితలు

# లవ్ స్టోరి
## ప్రేమకథే

# నో .......

అంటూ పెద్దగా అరుస్తూ లేచింది రమ. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. ఇప్పుడే స్నానం చేసినట్లుగా వుంది. చేతులు చల్లబడినాయి. గుండె స్పీడ్‌గా కొట్టుకుంటోంది. కళ్ళెంబట నీళ్ళు ధారగా కారిపోతున్నాయి.

ఒక్కసారిగా చుట్టూ చూసింది. తాజ్‌మహల్ బెడ్‌ల్యాంప్ తీసేసి వుంది. కిటికీలోంచి సూర్యుడి కిరణాలు మెల్లిమెల్లిగా వస్తున్నాయ్. దుప్పటి పక్కకి నెట్టేసి గబుక్కున లేచి ఫ్యాన్‌ని ఫుల్‌స్పీడ్‌కి పెంచి మళ్ళీ అలాగే వెళ్ళి పరుపు మీద చతికిలబడి పోయింది.

'ఏమైంది, ఏమిటయిపోయింది తనకు...' ఆలోచించుకునే లోపల ఒళ్ళంతా గగుర్పాటు - చేతి మీద వెంట్రుకలు నిక్కబొడుచు కున్నాయి. ఒక్కసారిగా నిలువెల్లా జలదరించింది. కాసేపటికి బాగా చలేసినట్టుగా అనిపించి అలాగే మళ్ళీ నిద్రలో నడిచినట్టుగా అప్రయత్నంగా లేచి ఫ్యాన్ ఆఫ్ చేసి మళ్ళీ బెడ్ మీదకు చేరింది.

ఒకటే ఆలోచన! 'అసలు ఏమైంది? ఎందుకిలా అయ్యింది... తన జీవితం ఏమైపోతుంది? నిజంగా ఇలాగే జరిగితే!? అమ్మో...? ఇంకేమైనా వుందా...? తను చచ్చిపోతుంది, నిజంగానే చచ్చిపోతుంది. అవును ధైర్యంగానే చచ్చిపోతుంది. కానీ ఎలా చచ్చిపోవటం? మొన్న సినిమాలో చూపినట్టు ఫ్యాన్‌కి ఉరి వేసుకుంటే!? కానీ అది చాలా కష్టం! మెడంతా ఒరుసుకుపోతుంది!! అలా కాకుండా 'నువాక్రాన్ హీరో' లాగా చచ్చిపోతే! అలా అస్సలు వద్దు-ఆ రోజు అతను చచ్చిపోతే చుట్టుపక్కల వాళ్ళు ఎన్నేసి మాటలన్నారో?

'ఏం...? అంతగా ప్రేమించిన వాడు దాన్నే పెళ్ళి చేసుకోక ఇలా పిరికి వెధవలా చావడమెందుకు...? దానికంటే కుక్క బతుకు నయము'ని అన్నారు. డాక్టరు, పోలీసులు అందరూ తిట్టడమే అతన్ని పాపం! అతన్నక్కణ్నుంచి తియ్యాలంటే అందరికీ అసహ్యమే. అతను చచ్చిపోయినాక కూడా ఎన్నెన్ని మాటలు పడ్డాడు!

అమ్మో వద్దొద్దు - నువాక్రాన్ తాగి చావొద్దు' రమ భయంతో వణికింది.

'గట్టిగా ముక్కుమూసుకుని ఐదు నిమిషాలు కూర్చుంటే ఠక్కున చచ్చిపోవచ్చు! ఇదేమాంచి ఐడియా' అనుకొని హాయిగా తృప్తిగా ఊపిరి పీల్చుకొని లేవబోతుంటే కళ్ళమ్మట నీళ్ళొస్తున్నాయి ఆ అమ్మాయికి తెలీకుండానే

*ఎంత కన్నీరు మున్నీరుగా కురిశాను మీ కోసమై*<br>
*ఎంతమిన్నేరు పన్నీరుగా దింపాను మీ కోసమై*<br>
*వర్తమానం నేడు సుందరాభిసారికవోలె*<br>
*నిలిచి హేలగా*<br>
*అగామి కాలగంభీరస్వామి కంఠాన వేయబోయే*<br>
*మాలగా*<br>
*నిలిచింది నేను, పిలిచింది నేను....*

తిలక్ గుర్తొచ్చాడు. మరింత బాధతో రమ గుండె ఆక్రోశిస్తోంది.

'అవును! నేనతని కోసమై బతుకుతు న్నాననుకొని.'

క్షణ క్షణం నా ఆశయాల్ని ఆశల్ని చంపేసుకుంటున్నాను. బతికీ చచ్చిన దానిలా మారాను.


రచయిత్రి చిరునామా:

**మహేశ్వరి**

1-1-241/1

చిక్కడపల్లి, హైదరాబాద్ - 20


ఇప్పుడు నిజంగానే శాశ్వతంగానే చచ్చిపోవాలనుకుంటున్నానా?

అసలు తనెందుకు చావాలి?

నో, నెవర్! తను చావకూడదు!!

తను బతికి మరో పది మందికి ఆశ్రయం కావాలి - ఆసరా కావాలి. జీవితాన్నివ్వాలి!

సమాజంతో పోరాడాలి.

రాజీపడలేని బతుకునెదిరించి నిలబడాలి.

ఎస్ ఐ విల్ ఫైట్!'

''ఎస్ ఐ విల్ ఫైట్'' అంటూ పైకే సన్నగా అనేసి రమ బాత్‌రూమ్‌లో కెళ్ళి తలుపేసుకుంది.

బ్రష్ చేస్తుంటే 'అసలు కలలు నిజమవుతాయా?' అని అనుమానం. 'అవును నిజమవుతాయా... ...?'

బ్రష్ చేసుకోవడం ఆగిపోయింది. రమ మళ్ళీ ఆలోచనలోకి జారిపోయింది. 'ఎందుకు నిజం కావూ!? అంతకు ముందు రాజేష్ వాళ్ళమ్మగారు కలలో బొట్టు లేకుండా కనిపిస్తే తను ఏడ్చేసింది నిజంగానే! ఉత్తకలే కదా అనుకొని మర్చేపోయింది దాదాపు....

రెండు రోజులు గడిచాయో లేదో రాజేష్ వాళ్ళ ఫ్రెండ్ చెప్పాడు-వాళ్ళ నాన్నగారు పోయి అయిదు రోజులయిందని, రాజేష్ ఒంటరిగా ఫీలవుతున్నాడని.

అతను చెప్తుంటే విపరీతమైన బాధవేసింది తనకి.

తనకి ఒకప్పుడు గర్వంగా వుండేది తన కలలు నిజమవుతున్నందుకు. కానీ ఆ గర్వం స్థానే బాధ చోటు చేసుకుంది కూడా.

అలాగే ఇప్పుడు తనకి... ... ..

ఈ కల కూడా నిజమయితే...? కుండపోతగా కన్నీళ్ళు ఆమె కందిపోయిన బుగ్గల మీంచి జారిపోతున్నాయి. బాత్రూమ్ తలుపుని ఎవరో కొడుతున్న శబ్దం.

తల విదిలించి గబగబా బ్రష్ చేసుకుని ముఖం పరపరా తోమి బయటికి వచ్చింది.

ఎదురుగా మమ్మీ కనిపించింది.

''మమ్మీ కలలు నిజమవుతాయా?''అని రమ పూర్తి చేసేలోపే -

''ఆ... అవుతాయి'' అంటూ హడావుడిగా బాత్రూమ్‌లో కెళ్ళి తలుపు వేసుకుంది మమ్మీ.

ముందు గదిలో కెళ్ళింది. డాడీ కాఫీ తాగుతున్నారు.

''డాడీ కలనిజమవుతుందా?'' కంగారు, ఆత్రుత కలగాపులగంగా అడిగింది.



పేపరుబాయ్ అప్పుడే పేపరు వేసి వెళ్ళాడు.

డాడీ పేపరందుకొని మరి తలఎత్తలేదు, సమాధానమివ్వలేదు.

రమ మనసులో అదే ఆలోచన! 'తన కలే నిజమైతే, తన జీవితం... తను కట్టుకున్న అపురూపమైన పిచ్చుకగూళ్ళు అన్నీ... అన్నీ దీపావళి టపాసులై పోతాయా? తనఆశయాలన్నీ తుపాను బాధితుల్లా చెల్లా చెదరై పోతాయా? తన ఆదర్శాలన్నీ కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లో మనుషుల్లా బలవంతంగా తన కళ్ళముందే సజీవ దహనమౌతాయా? ఆశయాదర్శాలే ఉఛ్వాస నిశ్వాసలు చేసుకున్న తను, అప్పుడు పిల్లలాడుకొనే మట్టిబొమ్మయిపోతుందా? చిన్నప్పుడెప్పుడో తాతయ్యగారి ఊర్లో చూసిన 'తోలుబొమ్మ'గా మారిపోతుందా?

తనకంటూ అపుడు ఆలోచనలు కానీ ఉద్దేశాలు కానీ అభిప్రాయాలు కానీ ఇలాంటి వేవీ వుండవా? అందరాడవాళ్ళ మాదిరిగానే... అహా... హ అచ్చు అమ్మలానే అయిపోతుందా? పొద్దునే లేవడం, చన్నీళ్ళు కుమ్మరించు కోవడం, నీళ్ళు కాచడం, కాఫీ లందించడం, అన్నం వండడం అన్నం తినమనే వాళ్ళకి టిఫిన్ వెయ్యడం, మధ్యాహ్నం బాక్సుల్లోకి వేరే టిఫిన్, బట్టలు వుతుక్కోవడం, వంట గది సర్దుకోవడం, ఇల్లు వూడ్చుకొని తుడుచుకోవడం... మళ్ళీ మధ్యాహ్నం కాఫీలు, టిఫెన్‌లు రెడీ చేయడం, రాత్రి డిన్నర్‌కి కావలసిన కూరలు తెచ్చుకోవటం మళ్ళీ వంటింట్లోకి వెడితే, ఇహ రాత్రి పదకొండు గంటలకే బయటికి రావటం! వేరే ఆలోచన లేకుండా ఎక్కడికీ వెళ్ళ వెళ్ళకుండా, ఇంట్లో ఎవరికీ ఏదీ తక్కువ కాకుండా ఎవరి టేస్ట్ ని అనుసరించి వాళ్ళకి అలా అమరుస్తుంది. మమ్మీ అచ్చు 'తోలుబొమ్మ' మాదిరిగానే అనిపిస్తుంది... తనూ అంతేనా?'

కాఫీ గ్లాసులో కన్నీటి చుక్కలు పడ్డాయి. టేబిల్‌పైన అద్దంలో మొహం చూసు కని వులికిపడింది. కళ్ళు బాగా ఎర్రబారినాయి. మొహం ఉబ్బిపోయి వుంది. లేచిం దగ్గర్నుంచి ఒహాటే ఏడుపయ్యె! ఇంకెలా వుంటుంది?

వీధిగేటు తీసిన శబ్దం! తలతిప్పి చూసిన రమకి గుండె గొంతులోకి వచ్చినట్టయింది. తలదించుకుని-నవ్వు అనేదే ఎరుగనట్టు ముడిచిన పెదవులతో-వస్తున్నాడు రాజేష్.

'రాజేష్! కలలోనైనా ఎవరి ఎడబాటు సహించలేక తను పొద్దుటి నుంచి విలపిస్తోందో-ఎవరితోనయితే తన జీవితాన్ని రంగుల హరివిల్లు అల్లుకొని ఊహల్లో విహరిస్తోందో - ఎవరినైతే మనసా వాచా కర్మణా తన వాడుగా తన ఆశయ ధర్మాలకి ప్రాణదాతగా అనుకుందో ఎవరైతే తనని అర్థం చేసు కున్న పరిపూర్ణ ప్రేమికుడు మానవ తా వాది అని నమ్మిందో- ఆ రాజేష్ వచ్చాడు... ...' అలా చూస్తూండి పోయిన రమ పూలు విసురుతున్నట్టున్న పాదాల సవ్వడికి తేరుకుని "హాయ్" అంటూ పలకరించింది.

రాజేష్ ఆమెకు సమాధానమివ్వకుండానే ఆమె తండ్రి దగ్గరకి వెళ్ళి ఉపోద్ఘాతంగాని నమస్కారమని కాని లేకుండానే -

"మా అమ్మగారితో మాట్లాడండి"అన్నాడు.

మళ్ళీ . తనే "మా అమ్మగారితో మాట్లాడండి. యాభై వేలు కట్నం, మా అక్కలు నలుగురికీ పట్టు చీరలు, వెండి కంచం, చెంబు, ఇంకా మిగతావి మీకు తెలుసు కదా!" అంటూ రమవైపు చూడకుండా చెప్తూ పోతున్నాడు.

మామూలుగానైతే ఆదర్శవాది అనిపించుకున్న రాజేష్ మాటలు రమకి

షాకింగ్‌గా వుండేవి. కానీ కల నిజమవుతోంది అన్న వాస్తవం ఆమె లోలోపల అగ్ని పర్వతాల్ని పేలుస్తోంది.

ఇంతలో డాడీ రమవైపు చూశారు. ఒక్కక్షణం మౌనం వహించి ఆ తర్వాత మెల్లగా

"నేను పాతికపైన ఒక్క చిల్లిగవ్వ కూడా ఎక్కువివ్వలేను" అంటూ డాడీ నిస్సహాయంగా మొహం పెట్టారు.

"ఇప్పటికే నాకు దాదాపు పది పదిహేను సంబంధాలు వచ్చినాయి. యాభై, డెభ్భై అంటున్నారు" అన్నాడాకింత గర్వంగా. 'ఇతను రాజేషేనా?' రమలో ప్రశ్నను రాజేష్ గొంతు కత్తిరించింది–

"కానీ నేను ఓ.కే. చెయ్యలేదు ఎందుచేతనంటే నేను మీ అమ్మాయి ప్రేమించుకున్నాము!! నేను మీకు మాట ఇచ్చాను!! అందుకని మీకు ముందు అవకాశం ఇవ్వాలనే వచ్చాను." అన్నాడు ఏదో ఉద్ధరింపు ధోరణిలో.

'అయితే...?' అన్నట్టుగా చూసాను డాడీ.

"కట్నమివ్వమనడం లేదు. కానీ మా అమ్మకి ఏదైనా ఎట్రాక్షన్ చూపిస్తే బాగుంటుందని!' మెల్లిమెల్లిగా అసలు విషయం పూర్తి చేశాడు.

"లేదు బాబూ! అలాంటి ఎట్రాక్షన్లు ఏవీ మేము చెయ్యలేము" సూటిగా చూస్తూ నిక్కచ్చిగా చెప్పారు డాడీ. మరోసారి తనవైపు చూశారు 'నేను ముందే చెప్పాను కదా!' అనట్టు.

"ఇలా అయితే చాలా కష్టమే మరి" అని గొణుక్కుంటూ–

"సరేలెండి నేను మా అమ్మని ఒప్పించడానికి ట్రై చేస్తాను!"అంటూ రమ వంక కనీసం చూడకుండా విసురుగా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కథ మామూలే! రమ ఎంతో ప్రయత్నించింది రాజేష్‌ని కలిసి విషయాలన్నీ వివరంగా వినాలని, చెప్పాలని, అడగాలని! కానీ రాజేష్ కలవలేదు.

'ఎందుకు ఇలా అయిపోయాడతను? ఆరేళ్ళబట్టీ పరిచయం వుండి ఇప్పుడూ ఇలా ప్రవర్తించడమేమిటి?' రమ మనసులో ప్రశ్నల మీద ప్రశ్నలు.

అప్పుడే వారం రోజులు గడిచిపోయాయి. అతను మొహం చాటు వేస్తున్నాడని అప్పటికి ఆమెకు అర్థమైంది. 'తుచ్ఛమైన డబ్బు కోసం రాజేష్ పవిత్రమైన ప్రేమని బలిచేస్తున్నాడు. ఒక త్రాసులో తను! ఇంకొక త్రాసులో డబ్బు–డబ్బున్న వాళ్ళకి దాసోహమై పోతున్నాడు!' కత్తిలా కోస్తున్న నిజం.

"పోస్ట్..." అన్న కేకతో ఆలోచనలు చెదిరిపోయాయి.

పోస్ట్‌లో శుభలేఖ వచ్చింది.

రాజేష్ వెడ్స్ పద్మలత.

అంతే రమ మెదడంతా ఒక్కసారి ఖాళీ అయిపోయింది. ఒళ్ళు చల్లబడి పోయింది.

'అచ్చంగా ఆ కలే నిజమైంది! నిజంగానే రాజేష్ తన కలలోలాగే పద్మని పెళ్ళి చేసుకుంటున్నాడు. ఎంత స్వార్థం, ఎంత అమానుషత్వం. ఎంత నమ్మక ద్రోహం... ...!'హృదయం వరద గోదావరి అయింది. షాక్ నుంచి మేల్కొన్న రమ ఒక నిర్ణయానికి వచ్చింది. ఇన్ని రోజులుగా తపన పడ్డ తన బేలతనానికి పిచ్చిగా నవ్వుకుంది. ముఖం చాలా రోజులకి రిలీఫ్‌తో కూడిన చిరునవ్వు పరచుకుంది.

పెళ్ళి రోజు వచ్చింది.

పెళ్ళికి వెళ్ళాలనేనిర్ణయించు కున్న రమ ఒక కవరు తీసుకుంది.

ఆదర్శవాదికి!

ముష్టివాడి కంచంలో మెతుకు లేరుకునే
నీ బతుకులో అర్థ భాగం అవ్వనందుకు –
వచ్చిన శవాల్ని పీక్కుతినే
నీ లాంటి కట్నపిశాచి సాహచర్యం నుంచి
పవిత్రమైన ప్రేమని గొంతెమ్మ
కోర్కెల రూపంలో చూసే నీ సాన్నిహిత్యం
నుంచి
నేను గుర్తించకపోయినా
నా శ్రేయస్సు కోసమే అన్నట్టు
నీ అంతట నీవుగా తొలగిపోయి
నా బతుకును శుభ్రపరిచినందుకు –
నా ఆదర్శాల కోసం నేను నిలబడడానికి
సరియైన అవకాశం అందించినందుకు –
అభినందనల్తో!
నీ హృదయంలో ఎన్నటికీ స్థానం ఉండకూడదని
ఆశించే
— రమ

అంటూ ముగించింది. అది కవర్లో పెట్టాక ఆమెను చాలా తృప్తిగా అనిపించింది. ఈసారి కూడా తన కల నిజమైనందుకు విపరీతమైన ఆనందం వేసింది. మనసు చంపుకుని బతక్కుండా మనసుని తన వశం చేసుకోవాలని నిర్ణయించుకొనే సరికి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. ●

